క్లుప్తంగా

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గెల్లంకి వెంకటరావు

సారవకోట: సారవకోట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా గెల్లంకి వెంకటరావు ఆదివారం పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు చైర్మన్‌గా పనిచేసిన కొండాల దేవేంద్రరావు స్థానంలో ఈయనను చైర్మన్‌గా నియమిస్తూ డీసీసీబీ అధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా గొర్లె డిల్లీరావు, కోరాడ అప్పయ్య కూడా బాధ్యతలు స్వీకరించారు. వీరికి వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీలు గుఱుపురం రామారావు, ఎర్ల ఆసిరయ్య, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, గద్దె బోయిన గోవిందరావు, పార్టీ నాయకులు తంగి రమణ, రావాడ శ్రీనివాసరావు, రెడ్డి పాపయ్య, మాజీ చైర్మన్ కొండాల దేవేంద్ర అభినందించారు.

నీలమణిదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి సహస్రనామార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 48వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఖడ్గ నామాలతో కుంకుమార్చనలు, మాల మంత్ర హోమాలు నిర్వహించామని ఈఓ వాసుదేవరావు తెలిపారు. తెల్లవారు జామునుంచి అధిక సంఖ్యలో భక్తులకు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆంధ్ర, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం లోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆదివారం ఉదయం పరీక్ష నిర్వహించారు. 392 మంది విద్యార్థులకు 277 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 141 మంది హాజరయ్యారని పరీక్షల కన్వీనర్, ప్రిన్సిపాల్ అర్చన తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రవచనాలు చెబుతున్న విష్ణుదాసానంద స్వామి

సారవకోట: ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలని పెందుర్తి శివానంద ఆశ్రమ పీఠాధిపతి విష్ణుదాసానంద స్వామి అన్నారు. మండలంలో గల బుడితి గ్రామంలోని ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం నిర్వహించారు. జ్యోతిర్మయి అమ్మవారి పాదుకాపూజ నిర్వహించి అనంతరం సత్సంగం ప్రారంభించారు. హిందూ ధర్మంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రకాశానంద స్వామి, నిర్విషానంద స్వామి, నరసింహ స్వామి తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మెండ అప్పన్న ఆర్థిక సహాయంతో అన్న సంతర్పణ చేపట్టారు. సంఘం సభ్యులు మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఆమదాలవలస: క్రమశిక్షణతోనే ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని శ్రీవాణీ విద్యానికేతన్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత డీఈఓ బి.మల్లేశ్వరరావు, రొటేరియన్ జె.కె.వెంకుబాబు, సంస్థ డైరెక్టర్ నారాయణరావు, కన్వీనర్ బి.వి.రమణమూర్తి, ప్రిన్సిపాల్ నందికేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మధుర ఫలం వెనుక చేదు నిజం!



మామిడి పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

- రసాయనాల ప్రభావంతో అనారోగ్యం

ఆమదాలవలస రూరల్: మామిడి, అరటి, సపోట, దానిమ్మ, ద్రాక్ష ఇలా ఏ ఫలమైనా చూడగానే తినాలనిపిస్తాయి. పండ్లు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు కూడా చెబుతున్నారు. సహజసిద్ధంగా పండిన ఫలాల్లో మాత్రమే పోషకాలు ఉంటాయని, పక్వానికి రాని పండ్లను కృత్రిమ పద్ధతుల్లో రసాయనాలను వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా మామిడి పండ్లు మార్కెట్‌లోకి దిగుమతి అవుతున్నాయి. వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా ఆరోగ్యానిచ్చే పండ్లలో రసాయనాలు వినియోగించి ప్రజలకు విక్రయిస్తున్నారు. పైకి నిగనిగలాడుతూ చూడగానే నోరూరించే ఈ పండ్లనే కొనుగోలు చేసి జనం తినేస్తున్నారు. ప్రజారోగ్యం గురించి కనీసం పట్టించుకోని అధికారులు షరా మామూలుగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. తినగానే మధురానుభూతిని కలిగించే మధుర ఫలాల వెనుక దాగి ఉన్న చేదు నిజాన్ని గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా..

పండ్లపై కార్బైడ్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా, కోర్టులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేసేవారే లేరు. దీంతో వ్యాపారాలు పక్వానికి రాకముందే పచ్చికాయలను, పిందెలను కోసేసి వాటికి రసాయనాలు వినియోగించి పండ్లుగా మారుస్తున్నారు. కార్బైడ్ వేసి మగ్గ పెట్టడం, పొగపెట్టి మగ్గపెట్టడం, ఇథనాల్ వంటి రసాయనాల్లో ముంచి పచ్చికాయలను పండ్లుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వేసవి సీజన్‌లో ఎక్కువగా మామిడి కాయలు దిగుమతి అవుతుండటంతో వాటిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఆ తోటల్లోనే కార్బైడ్, ఇథనాల్ వంటి రసాయనాలతో మాగబెట్టి రంగు తేలిన ఆ పండ్లను బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. రసాయనాలతో వినియోగించి మాగబెడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

రసాయనాలతో ఆరోగ్యానికి ప్రమాదం

రసాయనాలతో మాగబెట్టిన పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదకరం. స్వచ్ఛమైన పండ్లు తింటే ఆరోగ్యపరంగా మేలు చేస్తాయి. పండ్లు త్వరగా పక్వానికి రావడం కోసం రకరకాల రసాయనాలను వినియోగిస్తుంటారు. వీటి వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతినడంతోపాటు ఆరోగ్య సమస్యలు నెమ్మదిగా వస్తాయి. రసాయనాలు కలిపిన పదార్థాలను తినొద్దు.

– ఎస్.రమేష్, వైద్యాధికారి, తొగరాం పీహెచ్‌సీ, ఆమదాలవలస మండలం

న్యాయం చేయాలని వినతి



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వినతిపత్రం అందజేస్తున్న చిన్నారావు

కొత్తూరు: తాము సాగు చేస్తున్న డీ పట్టా భూమిని గూనభద్ర పంచాయతీ పరిధి కంఠమానుగూడ గ్రామానికి చెందిన ఎస్.రమేష్ ఆక్రమించుకున్నాడని అదే గ్రామానికి చెందిన సవర చిన్నారావు, సవర రమణ తదితరులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లారు. కంఠమానుగూడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వెళ్లిన ఎమ్మెల్యేకు చిన్నారావు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చినా ఆక్రమణలో ఉన్న భూమిని రమేష్ విడిచిపెట్టడం లేదని తెలిపారు. మా భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. తల్లిదండ్రులను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న సవర అమ్మాయిని ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు గిరిజనులు ఎమ్మెల్యేను కోరారు. అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై ఫిర్యాదు



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: ఆమదాలవలసకు సంబంధించి అగ్నిమాపక కేంద్రం ఆవరణాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని ఫైర్ ఎస్‌ఐ కె.అప్పారావు ఆదివారం తెలిపారు. ఆక్రమణదారులు నిర్మాణాలు చేపడుతుండగా స్టేషన్ సిబ్బంది వెళ్లి.. ఇది ప్రభుత్వ స్థలమని చెప్పారన్నారు. సిబ్బందిని అసభ్యకర పదజాలంతో దూషించారని తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆక్రమణదారులు శ్రీహరిపురం గ్రామానికి చెందిన చింతాడ దాలినాయుడు, సీహెచ్ శకుంతలపై ఫిర్యాదు చేశామన్నారు. ఆమదాలవలస పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని నిర్మాణాలు పరిశీలించి, నిలుపుదల చేయాలని సూచించారు.

ఐకమత్యంతో హక్కులు సాధిద్దాం



శ్రీశయన సంఘం రాష్ట్ర నాయకులతో జిల్లా, మండల, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు

- ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ శ్రీశయన సంఘం కార్యవర్గాల ఎన్నిక

ఆమదాలవలస: శ్రీశయన కులస్తులంతా ఐకమత్యంగా ఉండి హక్కులు సాధిద్దామని కేంద్ర శ్రీశయన సంఘం అధ్యక్షుడు వంగా మహాదేవ్ పిలుపునిచ్చారు. ఆమదాలవలసలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ శ్రీశయన సంఘం కార్యవర్గాల ఎన్నిక, సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన పాల్గొని తొలిత కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించి వారందితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. శ్రీశయన కులంలో ఉన్నవారి సమస్యలు, అందించాల్సిన పథకాలపై సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నూతన కార్యవర్గానికి ఆమదాలవలస మండల అధ్యక్షుడిగా గంగిల్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లబ్బ వెంకటరమణ, కోశాధికారిగా రెళ్ల రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భోగి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా తొళ్ల రఘుబాబు, గుజ్జల యర్రయ్య, అడంగి రమణ, బంటుపల్లి నాగరాజులను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా శ్రీశయన సంఘం అధ్యక్షుడు మండల మన్మధరావు, ప్రధాన కార్యదర్శి బంటుపల్లి రాజశేఖర్, జిల్లా, మండలం శ్రీశయన సంఘాల నాయకులు హాజరయ్యారు.

శిథిలావస్థలో కల్వర్టు



పాడైన రక్షణ గోడ

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామానికి ఆనుకుని ఉన్న హడ్డుబంగి గెడ్డపై ఆలికాం–బత్తిలి రోడ్డులో 100 ఏళ్ల క్రితం నిర్మించిన భారీ కల్వర్టుకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు పలుచోట్ల శిథిలమయ్యాయి. ఉన్న రక్షణ గోడ ఎత్తు తక్కువ కావడంతో రాకపోకలు సాగించే ప్రజలకు రక్షణ కరువైంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అనే భయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పాడైన చోట రక్షణ గోడలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



చందనం అలంకరణలో స్వామివారు

సారవకోట: మండల కేంద్రంలోని శివరామపాత్రుని కోనురు గట్టుపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో చందనోత్సవం నిర్వహించారు. వైశాఖ మాసం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు. స్వామి మూల విరాట్‌ను చందనంతో అలంకరించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

సింహాద్రి అప్పన్నగా రమాసత్యనారాయణస్వామి



రమాసత్యనారాయణస్వామి

హిరమండలం: హిరమండలంలోని అంగూరు వీధిలో గల రామా సత్యనారాయణ ఆలయంలో స్వామివారిని సింహాద్రి అప్పన్న స్వామి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారి జామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, మూల విరాట్‌ను అలంకరించారు. హిరమండలంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


రహదారికి మరమ్మతులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

పాతపట్నం: పాతపట్నం మహేంద్రతనయ నది తీరాన ఉన్న నీలకంఠేశ్వర ఆలయం నుంచి బూరగాం గ్రామం వరకు రహదారి మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభించారు. పాతపట్నం అమ్మవారి ఉత్సవాలకు ఈ రహదారి మీదుగా ట్రాఫిక్ మళ్లించడానికి ఉపయోగపడుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు భావిస్తున్నారు. అందువల్ల ఉత్సవ కమిటీ సభ్యులు రహదారి ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి, గోతులను పూడ్చారు.

త్రినాథస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హిరమండలం: మండల కేంద్రంలోని అంబావల్లి వీధిలో ఉన్న త్రినాథస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం మొదటి ఆదివారం సందర్భంగా తెల్లవారు జామునుంచే చేరుకుని పూజలు నిర్వహించారు. ఈ మాసంలో పూజలు చేస్తే మంచి జరుగుతుందని అర్చకులు రాధాకృష్ణ పండా తెలిపారు. భక్తులు ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



గిరిజనలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని కంఠమానుగూడ గిరిజన గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లు అతికించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పెంచిన పింఛన్ మొత్తం, రైతు భరోసా, అమ్మఒడి ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పార్టీ నేతలు చింతాడ సూర్యనారాయణ, లోతుగెడ్డ తిరుపతిరావు, కర్లేపల్లి వైకుంఠరావు, బూర్లె శ్రీనివాసరావు, వనము లక్ష్మీనారాయణ, పంకజదాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఆమదాలవలస రూరల్: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్స్, ఉద్యోగ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి క్రాంతి, దుర్గాసి గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొత్తరోడ్ జంక్షన్ వద్ద గల ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. 137వ మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని, ఇప్పటికే దేశంలో ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేడేను కార్మికుల హక్కుల దినోత్సవంగా నిర్వహించాలన్నారు. వాడవాడలా జెండా ఆవిష్కరణలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇఫ్టూ నాయకులు దమ్ము సింహాచలం, దంత వెంకన్న, అన్నెపు సూర్యనారాయణ, చిత్తిరి లక్ష్మణరావు, సింగూరు బాబూరావు, నిమ్మడా రాము, కెల్లా పైడయ్యా, దువ్వు జయప్రద, సవలపురపు కృష్ణవేణి, ససపల అప్పారావు, ప్రకాష్, సత్యనారాయణ, పకీర్ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ



డీజిల్ దొంగిలించారని చూపిస్తున్న డ్రైవర్

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామానికి సమీపంలో వంశధార ఎడమ కాలువకు ఆనుకుని ఉన్న రోడ్డుపై శనివారం రాత్రి నాలుగు ప్రొక్లయినర్ల నుంచి 150 లీటర్ల డీజిల్‌ను దొంగలించారు. ఈ కాలువ గట్టుపై వడ్డినవలస నుంచి కొమనాపల్లి వెళ్లే రోడ్డు విస్తర్ణ పనులు జరుగుతుండగా ప్రొక్లయినర్లు రాత్రి సమయంలో నిలిపారు. గుర్తుతెలియని కొందరు యంత్రాల పైపులను కోసి ఒక్కొక్క ప్రొక్లయినర్ నుంచి సుమారు 40 నుంచి 50 లీటర్లు డీజిల్‌ను దొంగలించినట్లు సంబంధిత వాహన యజమానులు సారవకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

విరాళాల అందజేత



విరాళం అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి గ్రామ పండగలు మే 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పండగలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం రూ.లక్షా పది వేలు విరాళాలు సేకరించారు. పాతపట్నంకు చెందిన డాక్టర్ ఎ.శ్రీధర్ రూ.40 వేలు, డాక్టర్ కె.మోహన్‌బాబు రూ.20 వేలు, డాక్టర్ శిమ్మన్నాయుడు రూ.10 వేలు, ఎస్ఎస్‌డీ మెడికల్ స్టోర్ శివ రూ.30 వేలు, డాక్టర్ షణ్ముఖరావు రూ.10 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు.

ఉత్సవ కమిటీ సభ్యులు లింగాల మధుబాబు, కర్ల రాజు, లింగాల రవికుమార్, సూలు బుజ్జి, కొండాల యరకయ్య, శిర్ల జోగరావు, బి.నారాయణమూర్తి, కనకాల కర్రన్న, కొత్తపల్లి రవి, శివ, వెంకటరమణ, నాగేశ్వరరావు, శంకరరావు, ఆలయ గుమస్తా సుదర్శనరావు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎంఈఓ రామరాజు

పొందూరు: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించవచ్చని, భూతాపాన్ని తగ్గించవచ్చని ఎంఈఓ పీవీ రామరాజు అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభావతి జాగృతి ట్రస్టు, శ్రీకాకుళం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రభావతి జాగృతి ట్రస్టు చైర్మన్ నప్పటి వసంతరావు పాఠశాలలో జామ, మామిడి, నేరేడు, సపోట మొక్కలను నాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాతపట్నం: మండలంలోని సీది కూడలి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ మొబైల్ టీమ్ ఎస్ఐ కల్యాణి ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకున్నారు. ధనుపురం నుంచి పాతపట్నానికి ఇసుక తీసుకువస్తుండగా ధనుపురం గ్రామానికి చెందిన మామిడి లక్ష్మణరావు పట్టుకుని పాతపట్నం పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

నేడు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

బూర్జ: ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి జలుమూరు గ్రామంలో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, కొత్తది ఏర్పాటు చేయనున్నట్లు టెక్కలి ఈఈ ఎ.రాజశేఖర్ శనివారం తెలిపారు. ఉదయం 8:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని జలుమూరు విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు కోరారు.

ఉత్తమ రైతుకు సత్కారం

కొత్తూరు: కొత్తూరు గ్రామానికి చెందిన లోతుగెడ్డ ఇందిరరామ్‌కు ఒడిశా రాష్ట్రం కటక్‌లోని ఐసీఏఆర్–నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఆర్ఆర్ఐ) 78వ ఫౌండేషన్ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఆర్ఐ అధికారులు, నైరాలోని ఆర్‌సీఆర్ఆర్ఎస్ అధికారులు, మండలంలోని ఉత్తమ రైతు అంపిలి బుచ్చిబాబు, రైతులు నిమ్మగడ్డ కృష్ణ, రమేష్, లక్ష్మణరావు ఉన్నారు.

చీడిపూడిలో పారిశుద్ధ్య పనులు



మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు నీటి కాలువల్లో పూడికలు తొలగింపు పనులను మాజీ ఎంపీటీసీ నిక్కు కృష్ణారావు చేపట్టారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటం మురుగు నీరు నిల్వ ఉండి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు.